

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు రేపు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు లేని సమాజం కోసం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' తన వంతుగా కృషి చేస్తోంది. ఈ మేరకు మిమ్స్ కళాశాల యాజమాన్యంతో కలిసి మంగళవారం ఉదయం 10 గంటలకు యువతకు అవగాహన సదస్సు నిర్వహించనుంది. మిమ్స్ కళాశాల ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది. ముఖ్యఅతిథులుగా కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ ఆస్మాపరహీన్, శ్రీరామ ఎడ్యుకేషనల్ చైర్మన్ కె.సత్యనారాయణరాజు హాజరు కానున్నారు. కొంతమంది యువత మాదకదవ్యాల బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చిన్న వయసు నుంచే గంజాయి, నల్లమందు తదితర డగ్స్‌కు అలవాటుపడి అనారోగ్యానికి గురవుతున్నారు. వారి కుటుంబాలను అగాథంలోకి నెట్టేస్తున్నారు. చదువు, భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. మరోవైపు మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసులకు చిక్కి జైలుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తుంది. యువతకు దిశా నిర్దేశం చేసి, తద్వారా సమాజంలో వారిని ఉత్తములుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా నెల్లిమర్లలోని మిమ్స్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనుంది.

గంజాయిపై ఉక్కుపాదం

- ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు విస్తృత తనిఖీలు
- పాత నేరస్థులపై నిఘా
- పట్టుబడుతున్న సరుకు
- తగ్గుముఖం పడుతున్న కేసులు
- గత వైసీపీ పాలనలో విచ్చలవిడిగా విక్రయాలు



వేపాడలో విశాఖ-అరకు రహదారిపై కారును తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

(విజయనగరం క్రైం/రాజాం రూరల్)

గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరిగాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకూ ఎంతోమంది యువత, విద్యార్థులు దీని బారినపడ్డారు. గంజాయి మత్తుకు ఎందరో జీవితాలు బలైయ్యాయి. ఎన్నో కుటుంబాలు ఛిద్రమయ్యాయి. అడ్డుకోవాల్సిన పోలీసులు కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. అయితే, రాష్ట్రంలో కొలువు దీరిన కూటమి ప్రభుత్వం మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించింది. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పోలీసు యంత్రాంగం డ్రగ్స్, గంజాయి నియంత్రణపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగా జిల్లా సరిహద్దుల వెంబడి విస్తృత తనిఖీలు, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టింది. దీంతో గంజాయి, డ్రగ్స్ విక్రయదారుల్లో టెన్షన్ మొదలైంది. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్.. మాదక ద్రవ్యాల నియంత్రణపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో అధికారులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఫలితంగా కొద్ది రోజులుగా జిల్లాలో గంజాయి కేసులు తగ్గుముఖం పడుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.

రాజాంలో జోరుగా అమ్మకాలు..

రాజాంలో గంజాయి అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. అరకు ప్రాంతం నుంచి కిలోల చొప్పున కొనుగోలు చేసి రాజాం తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. సులభంగా ఆదాయం పొందే లక్ష్యంతో కొంతమంది చేస్తున్న వికృత చేష్టలకు యువత బలైపోతున్నారు.

- రేగిడి మండలం బూరాడలో అదే మండలం పారాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అరకు నుంచి తెచ్చిన రెండు కిలోల గంజాయిలో కొంత రాజాంలో అమ్మి మిగిలినది ఇంటికి తీసుకువెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు.
- రాజాంలో ఇటీవల గంజాయి కలిగి ఉన్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.
- గురవాం ప్రాంతంలో ఓ వ్యక్తి మద్యంతో పాటు గంజాయి కూడా అమ్మకాలు చేస్తున్నట్లు బోగట్టా.
- గతంలో రాజాం రాణావీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.7లక్షల విలువ చేసే నిషేధిత పొగాకును విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు పట్టుకున్నారు. ఈ పొగాను ఒడిశా రాష్ట్రం నుంచి దిగుమతి చేసినట్లు అధికారులు గుర్తించారు.
- రాజాంలోని మాధవ బజార్‌కు చెందిన ఓ వ్యాపారి ఒడిశా నుంచి పొగాకును తెప్పించి నియోజకవర్గం అంతటా సరఫరా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇతనితో పాటు వంగర మండలానికి చెందిన ఓ వ్యాపారి ఒడిశా నుంచి కొత్తూరు, సీతంపేట, పాలకొండ మీదుగా దిగుమతి చేసి సుమారు పది మండలాలకు సరఫరా చేస్తున్నట్లు కూడా చెప్పుకుంటున్నారు.

అర్ధరాత్రి దాటాకనే..

ఒడిశాలోని బరంపురం-జైపూర్ పట్టణాలకు రాత్రి పది గంటల తరువాత రాజాం మీదుగా కనీసం 20 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్ని బస్సులు నవరంగపూర్, పాలకొండ మీదుగా, మరికొన్ని బస్సులు శ్రీకాకుళం-రాజాం మీదుగా వచ్చి వెళ్తుంటాయి. ఈ బస్సులపై నిఘా లేకపోవడంతో ఈ ప్రాంత వ్యాపారుల పాలిట వరంగా మారింది. దీంతో నిషేధిత ఉత్పత్తుల్ని రాజాం పట్టణంలో డంప్ చేస్తున్నారు. రాజాంకు 19 కిలోమీటర్ల దూరంలో చీపురుపల్లి రైల్వేస్టేషన్, 10 కిలోమీటర్ల దూరంలో జి.సిగడాం రైల్వేస్టేషన్ ఉంది. దీంతో కొంతమంది వ్యాపారులు రైల్వేమార్గం ద్వారా అక్రమంగా మాదక ద్రవ్యాలను రాజాం తీసుకువస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ తరహా వ్యాపారం చేసి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. అయితే, గత కొన్ని రోజులుగా పోలీసులు దాడులు చేస్తుండడంతో వ్యాపారులు వణికిపోతున్నారు. గంజాయి, పొగాకు తదితర మత్తుపదార్థాలను క్రయవిక్రయాలు చేసేందుకు భయపడుతున్నారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం ఈ కేసులు తగ్గుముఖం పడుతున్నాయి.

మూడేళ్లలో నమోదైన కేసులు..

సంవత్సరం	కేసులు	పట్టుబడిన గంజాయి (కిలోలు)	విలువ
2022	51	3,181.55	రూ.97,12,460
2023	58	2,559.169	రూ.1,01,32,390
2024 (జూలై వరకూ)	25	510.807	రూ.11,78,615



శనివారం రాత్రి విజయనగరం రైల్వే స్టేషన్ వద్ద 8 కిలోల గంజాయితో పట్టుబడిన నిందితులు

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం..

జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాయి. పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టాం. అనుమానితులపై సస్పెక్ట్ షీట్‌లు తెరుస్తాం. తరచుగా గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థలు, ప్రధాన ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. ఎక్కడి నుంచి సరఫరా అవుతుంది? ఎవరెవరి హస్తం ఉందో? గుర్తించి దాని మూలాలను బయటకు తీస్తాం. జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తోంది.

-వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం



సంతకవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

- ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాల పంపిణీ
- మంత్రి లోకేష్ ఆదేశాలతో అందిస్తున్న అధికారులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కలెక్టరేట్, జూలై 28: ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాల పంపిణీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఆయన గెలుపొంది రాష్ట్ర మానవ వనరులు శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ఆ హామీని నెరవేరుస్తున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ కళాశాలలకు పుస్తకాలు చేరాయి. కొన్ని జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు అందజేశారు. జిల్లాలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఐదు వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. సైన్సు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు ఆరు వైట్ పేపర్స్ బుక్స్, మరో ఆరు రూల్ పుస్తకాలు చొప్పున అందజేస్తున్నారు. అలాగే బ్యాగ్‌లు కూడా పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థికి సుమారు రూ.1500 నుంచి రూ.2వేలు విలువ చేసే కిట్లను అందజేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగుపడనున్న ఫలితాలు..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఇంటర్ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సాధారణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరేవారిలో ఎక్కువమంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. వారికి పుస్తకాలు పంపిణీ చేయకపోవడం, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడేవారు. కళాశాలల వైపు పెద్దగా దృష్టి పెట్టేవారు కాదు. ఆర్థిక సమస్యలతో చాలామంది పుస్తకాలను కొనుగోలు చేయలేకపోయేవారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను అర్థం చేసుకుని చదువుకునేవారు. పాఠ్య పుస్తకాలు లేకపోవడంతో పరీక్షల సమయంలో ఇబ్బంది పడేవారు. అనుకున్న స్థాయిలో ఫలితాలు కూడా వచ్చేవి కావు. దీంతో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తమ పిల్లలను ప్రైవేటు కాలేజీల్లో చేర్పించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ కాలేజీలు, కేజీవీబీల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు బ్యాగ్‌లు కూడా అందజేయాలని ఆదేశించారు. ఇచ్చిన మాట ప్రకారం నెల రోజుల లోపలే కొత్త పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల విద్యార్థులతో పోటీపడి చదివే అవకాశం ఉంటుంది. దీనివల్ల మెరుగైన ఫలితాలు సాధించే వీలుంటుంది.

ఆనందంగా ఉంది..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను ప్రభుత్వం అందజేయడం చాలా ఆనందంగా ఉంది. సుమారు రూ.2వేల విలువ చేసే పుస్తకాలను కొనుగోలు చేయడం చాలా కష్టం. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పుస్తకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదివి మంచి ఫలితాలు సాధిస్తాం.

-ఎన్.చంద్రకళ, ఎంపీసీ, సెకండియర్, గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ

చదువుపై ఆసక్తి పెరుగుతుంది..

ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు అందజేయడం వల్ల విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుంది. ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థుల్లో ఎక్కువమంది నిరుపేద, మధ్య తరగతి చెందిన వారు ఉంటారు. వీరికి పుస్తకాలను కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత ఉండదు. ఉచితంగా పుస్తకాలు ఇవ్వడంతో ఇక నుంచి మంచి ఫలితాలు వస్తాయి.

-ఎం.హరి బాబు, ఫిజిక్స్ లెక్చరర్, గంట్యాడ కళాశాల

చాలా ఉపయోగ పడతాయి..



పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్ విద్యార్థులకు చాలా ఉపయోగ పడతాయి. గతంలో పుస్తకాలు ఇవ్వకపోవడంతో పాత పుస్తకాలను విద్యార్థులకు అందజేసి పాఠాలు బోధించేవాళ్లం. ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదు. కొత్త పుస్తకాలనే ప్రభుత్వం అందజేస్తుంది. దీనివల్ల మంచి ఫలితాలు రావడంతో పాటు ప్రభుత్వ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది.

-ఎల్వీ జగన్నాథరావు, ప్రిన్సిపాల్, గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

బొత్స.. ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారా?

- దన్నానపేట ఘటనను రాజకీయంగా మాట్లాడడం సరికాదు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రూరల్, జూలై 28: నెల్లిమర్ల దన్నానపేటలో రోడ్డుపై ఆక్రమణ తొలగింపు విషయంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విచిత్రంగా మాట్లాడుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొత్స వ్యాఖ్యలు ఆక్రమణలను ప్రోత్సహించేలా ఉన్నాయని మండిపడ్డారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దన్నానపేటలో ఆక్రమణల తొలగింపు కక్ష పూరితమని, జిల్లాలో ఎప్పుడూ ఇలాంటివి లేవంటూ బొత్స చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 'దన్నానపేటలో ఎంతోమంది ఎస్సీలు నివసిస్తున్న మూడు ఎకరాల భూమిని జగనన్న కాలనీ కోసం కేటాయించి పోలీసుల జోక్యంతో వారందరినీ అక్కడి నుంచి బలవంతంగా తరలించలేదా?. ఈ విషయాన్ని బొత్స మరచిపోయినట్లు ఉన్నారు. 2022లో దన్నానపేటలో రోడ్డుకి అడ్డంగా ఓ వ్యక్తి ప్రహరీ నిర్మించారని, దీనివల్ల ఇబ్బందిపడుతున్నామని ఆ గ్రామ ప్రజలు, రైతులు ఫిర్యాదు చేసినా గత సర్కారు తొలగించలేదు. తాజాగా మరోసారి ఆ గ్రామస్థులు, అక్కడి రైతులు ఫిర్యాదు చేశారు. అందుకే ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అక్రమ నిర్మాణాన్ని తొలగించాం. సొంత స్థలంలో నిర్మాణాలు చేసుకుంటే మాకు ఇబ్బంది లేదు. విజయవాడలో 2014లో టీడీపీ ఏర్పాటు చేసిన ప్రజా వేదికను వైసీపీ ప్రభుత్వం కూల్చివేసింది. ఇది ఆక్రమణ కాదు. ప్రజలకు ఉపయోగపడే భవనం. అటువంటి భవనాన్ని కూల్చే సందర్భంలో మంత్రిగా ఉన్న బొత్స ప్రశ్నించారా?. దన్నానపేటలో జరిగిన అంశాన్ని రాజకీయంగా మాట్లాడడం హేయమని' మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

శుద్ధ జలాలేవీ?

- రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు ఇది. దాదాపు రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లాంట్ కొద్దిరోజులకే మూలకు చేరింది. దీంతో విద్యార్థులు ఆరుబయట కుళాయి, బోరు నీరు తాగుతున్నారు. జలుబు, దగ్గు వంటి రుగ్మతలకు గురవుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఇళ్ల నుంచి వాటర్ బాటిళ్లతో నీరు తెచ్చుకొంటున్నారు.



ఆర్వో ప్లాంటు పనిచేయకపోవడంతో కొళాయి నీరు పట్టుకుంటున్న విద్యార్థులు

- పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు
- 'నాడు-నేడు'లో రూ.వందల కోట్లతో ఏర్పాటు
- కొద్దిరోజులకే మూలకు చేరిన వైనం
- ప్రజాధనం వృథా

(రాజాం)

జిల్లాలో వందలాది పాఠశాలల్లో నాడు-నేడు పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. వందల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. వైసీపీ అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయి. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతాయని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే పాఠశాలలు కొంతవరకూ అభివృద్ధి చెందినా.. అంతకు మించి వైసీపీ నేతలు బాగానే వెనుకేసుకున్నారు. భారీగా అవినీతికి పాల్పడి దోచుకున్నారు. ఇటీవల అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాడు-నేడు పనులపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో ఎక్కడికక్కడే వైఫల్యాలు, అవినీతి బయటకు వస్తోంది.



కంచరాంలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్ పరికరాలు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో తొలి విడత 'నాడు-నేడు' పథకంలో భాగంగా 841 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. కానీ, 680 పాఠశాలల్లో మాత్రమే ఏర్పాటు చేశారు. ఇందుకుగాను రూ.183 కోట్లు ఖర్చుచేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. రెండో విడతలో 738 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరుకాగా.. రూ.231 కోట్లు ఖర్చుచేశారు. రెండు విడతల్లో కలిపి ఆర్వో ప్లాంట్ల నిర్మాణానికి రూ.400 కోట్లు ఖర్చుచేసినట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. దీంతో తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న బాధ వర్ణనాతీతం. చేతిపంపుతో పాటు కొళాయిల నీటిని తాగుతున్నారు. దీంతో అనారోగ్యానికి గురవుతున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



రాజాం పోలీసుస్టేషన్ స్కూల్‌లో పని చేయని ఆర్వోప్లాంట్

విద్యార్థుల సంఖ్యను బట్టి..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకూ ఖర్చు చేశారు. విద్యార్థులకు ఫ్లోరైడ్ నీటి బాధ నుంచి విముక్తి కల్పించేందుకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ నిర్వహణ మాత్రం చూడలేకపోయింది. దీంతో రకరకాల కారణాలతో ప్లాంట్లు మూలకు చేరాయి. ఆహ్లాద ఇంజనీర్స్ లిమిటెడ్, ఇన్నోవేటివ్ ఇండస్ట్రీస్,లివ్‌ప్యూర్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి పలు కంపెనీల నుంచి ఆర్వో ప్లాంట్లను తెప్పించారు. అప్పట్లో సాంకేతిక సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచారు. కానీ ప్రస్తుతం ప్లాంట్లు పనిచేయడం లేదని పాఠశాలల హెచ్‌ఎంలు ఫోన్ చేస్తుంటే టెక్నికల్ సిబ్బంది స్పందించడం లేదు. దీంతో హెచ్‌ఎంలు సైతం మౌనం దాల్చాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది. లేకుంటే వందల కోట్లు విలువచేసే ఆర్వో ప్లాంట్లు దేనికీ పనికిరాకుండా పోయే అవకాశం ఉంది.

ఫిర్యాదులు వస్తున్నాయి..

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. ఆ ప్లాంట్‌లు బిగించిన వారు హెచ్‌ఎంలు చేసిన మెసేజ్‌లకు స్పందించి రావాలి. కానీ ఆ సంస్థలు కనీసం స్పందించడంలేదు. మేము కూడా స్వయంగా ఆ కంపెనీలకు సమాచారం ఇచ్చాం. అయినా ఎవరు రావడంలేదు. వాటికి మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే సంబంధిత కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్కడ నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-ప్రేమ్‌కుమార్, డీఈవో, విజయనగరం


దిక్సూచి
విజయనగరం ● సోమవారం 29 జూలై 2024
diksuchi@andhrajyothy.com

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 3

భారతీయ సాక్ష్య అధినియమ్

ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో 167 సెక్షన్లు ఉండగా, ప్రస్తుతం బీఎస్ఏలో 170 సెక్షన్లు ఉన్నాయి. గత చట్టంలోని 23 సెక్షన్లలో మార్పులు చేశారు.



కీలకాంశాలు

- ఈ చట్టం 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తరించింది. ఎలక్ట్రానిక్స్/ డిజిటల్ రికార్డులను కూడా ఈ చట్టం 'పేపర్ డాక్యుమెంట్స్‌'తో సరిసమాన సాక్ష్యాలుగా పరిగణిస్తోంది. ఈ-మెయిల్స్, సర్వర్ లాగ్స్, కంప్యూటర్స్, స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ఎస్సెమ్మెస్‌లు, వెబ్‌సైట్‌లు, లోకేషనల్ ఎవిడెన్స్ వంటి డిజిటల్/ ఎలక్ట్రానిక్స్ సాక్ష్యాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.
- అంతేకాక ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా సాక్ష్యులు, బాధితులు, ముద్దాయిలు తమ వాంగ్మూలం ఇవ్వడానికి ఈ కొత్త చట్టం అనుమతిస్తూ, దానికి వ్యక్తిగత ప్రత్యక్ష వాంగ్మూలంతో సరిసమాన స్థాయి కల్పించింది.
- ముద్దాయి నేరం అంగీకారాన్ని, ఇకపై క్రిమినల్ కేసుల్లో తప్పనిసరిగా పరిగణించక్కర్లేదు. బెదిరింపులు, ప్రలోభాలు తదితరాల కారణంగా నేరాంగీకారం జరిగినట్లు న్యాయమూర్తి భావిస్తే దానిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు.
- సోదాలు, నేర సంఘటన స్థల పరిశీలన సమయంలో తప్పనిసరిగా సంబంధిత అధికారి ఫోన్ ద్వారా చిత్రీకరణ జరపాల్సి ఉంటుంది. అలాంటి దృశ్య, శ్రవణ చిత్రీకరణలు జతచేయని చార్జిషీట్లు చెల్లవు. ఈవిధంగా చిత్రీకరించిన దృశ్య శ్రవణ చిత్రీకరణలు నేరుగా క్లౌడ్ బేస్డ్ ప్లాట్‌ఫాంలోకి అప్‌లోడ్ చేయవచ్చు. టాంపరింగ్, అవకతవకలు నివారించడానికి ఎటువంటి జాప్యం లేకుండా వీటిని కోర్టుకు సమర్పించాల్సి ఉంది.
- కోర్టుల్లో పరీక్షించలేని భారీ పరిణామం గల డాక్యుమెంట్స్ లేదా సాంకేతికపరమైన డాక్యుమెంట్ల పరిశీలనలో నిష్ణాతులైన వారు ఇచ్చే వాంగ్మూలాన్ని సెకండరీ ఎవిడెన్స్(ద్వితీయస్థాయి సాక్ష్యం)గా పరిగణిస్తారు.
- ఒక నేరంలో భాగమైన వ్యక్తులను సామూహికంగా విచారిస్తున్నప్పుడు (జాయింట్ ట్రైయిల్) వారిలో ఎవరైనా అరెస్ట్ వారెంట్ అందుకోకపోయినా, పరారీలో ఉన్నా సరే వారిని కూడా కలిపే న్యాయవిచారణ చేస్తారు.

విమర్శలు

- సాక్ష్యాధారాలు చిత్రీకరించే సమయంలో, తదుపరి కూడా నేటి ఆధునిక సాంకేతికతల సహాయంతో, సాంకేతికపరమైన లోపాల సహకారంతో ఏమార్చే అవకాశం ఉంది.
- ఎలక్ట్రానిక్ రికార్డులు ధ్రువీకరణ పొంది ధ్రువపత్రాలను కలిగి ఉన్నప్పుడే వాటిని డాక్యుమెంట్స్‌గా పరిగణిస్తారు. కానీ బీఎస్ఏలో సాధారణ డిజిటల్, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని కూడా సాక్ష్యంగా డాక్యుమెంట్ల స్థాయి కల్పించి పరిగణించడం వైరుధ్యాలకు కారణం అవవచ్చు.
- పోలీసు కస్టడీలోని వ్యక్తి శరీరంపై ఉన్న గాయాలకు పోలీసులు బాధ్యత వహించాలి అనే అత్యున్నత న్యాయస్థానం, లా కమిషన్ సిఫార్సులకు మన్నన దక్కలేదు. అట్టి కట్టుబాటు పోలీసులపై ఏర్పడలేదు.
- కేవలం ఏవో కొన్ని అంశాలు మినహా పాత చట్టమే కొత్తరూపుతో కొనసాగింపునకు వచ్చింది. సాంకేతిక అంశాల జోడింపు తప్ప ఇతరత్రా పెద్దగా విప్లవాత్మక మార్పులు ఏమీ లేవు.
- కొన్ని క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి చేశారు. కానీ నేర స్థలానికి మొదట వెళ్లేది పోలీసులు. వారి సోదాలు, పరిశీలనల చిత్రీకరణల వల్ల ఫోరెన్సిక్ ఆధారాలు భంగపడవచ్చు.

అయితే సాంకేతిక అంశాల జోడింపుతో ఈ కొత్తచట్టం విచారణలో వేగాన్ని తీసుకురావడానికి తోడ్పడటంతోపాటు మారుతున్న నేరాల సరళి నేపథ్యంలో సాక్ష్యాల పరిధిని విస్తరించిందనడం అతిశయోక్తి కాదు. అదేవిధంగా నేరవిచారణలో, దర్యాప్తులో అక్రమాలను నిరోధించేందుకు సాంకేతికపరంగా చేసిన మార్పులు పారదర్శకతను పెంపొందించగలవు. అయితే గత చట్టంలోని అన్ని అంశాలను పూర్తిగా సంస్కరించలేదు. కేవలం కొద్దిపాటి అంశాల్లోనే మార్పులు చేసి కొత్త చట్టాన్ని రూపొందించారు. అయినప్పటికీ దశాబ్దాల తరబడి క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలకు నోచుకోని పరిస్థితుల్లో దీనిని ఒక ముందుడుగు గానే పరిగణించాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఏపీపీఎస్సీ /ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఘనము

రీజనింగ్

I) 8 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల ఎరుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 2 సెం॥ మీ॥ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వల్ల మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 20 బి) 40 సి) 56 డి) 64

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 8 బి) 6 సి) 12 డి) 16

3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 24 సి) 32 డి) 48

4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 12 బి) 18 సి) 10 డి) 24

5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 18 బి) 12 సి) 8 డి) 6

సమాధానాలు:
1. (డి) 2. (ఎ) 3. (బి) 4. (డి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{8}{2} = 4$

మొత్తం ఘనాలు = $(n^3) = 4^3 = 64$.

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు).
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు $(n - 2) \times 12 = (4 - 2)\times 12 = 2 \times 12 = 24$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు $(n-2)^2 \times 6 = (4-2)^2 \times 6 = (2)^2 \times 6 = 4 \times 6 = 24$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు $(n-2)^3 = (4-2)^3 = 2^3 = 8$

సులభపద్ధతి: 8 సెం.మీ. కొలత ఉన్న ఘనం 2 సెం॥ మీ॥ కొలతతో విభజిస్తే అంటే నాలుగు నాలుగుగా ఏర్పడుతుంది. ఇప్పుడు నాలుగు నాలుగుగా ఉండే రేఖాచిత్రం ఔట్‌సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	3
2	1	1	2
2	1	1	2
3	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $4^3 = 64$
2. మూడు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే కార్నర్ 4ని 2తో గుణించాలి. (2 అంటే పై వైపు 4 కార్నర్స్ కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న, ఘనాలు అంటే కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అంటే పై వైపు, కింద వైపు, మధ్య వైపు) పై రేఖాచిత్రం గమనించిన కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలినవి 8. దీనిని 3తో గుణించగా $8 \times 3 = 24$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలోని భాగంలో గల వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అంటే ఆరు ముఖాలు అని అర్థం) పై రేఖాచిత్రం గమనించిన చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 4 ఉన్నాయి. కావున $4 \times 6 = 24$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$64-(24+24+8) = 64 - 56 = 8$ సమాధానం అవుతుంది.

II) 15 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల పసుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 3 సెం.మీ.ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వలన మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 100 బి) 150 సి) 125 డి) 175

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 8 సి) 24 డి) 12

3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 36 బి) 12 సి) 48 డి) 24

4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 48 బి) 54 సి) 63 డి) 52

5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 12 బి) 18 సి) 27 డి) 36

సమాధానాలు: 1. (సి) 2. (బి) 3. (ఎ) 4. (బి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{15}{3} = 5.$

మొత్తం ఘనాలు $n^3 = 5^3 = 125$

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు)
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు $(n-2) \times 12 = (5-2) \times 12 = 3 \times 12 = 36$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు $(n-2)^2 \times 6 = (5-2)^2 \times 6 = 3^2 \times 6 = 9 \times 6 = 54$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు $= (n-2)^3 = (5-2)^3 = 3^3 = 27.$

సులభ పద్ధతి: 15 సెం.మీ. కొలత ఉన్న ఘనం 3 సెం.మీ.ల కొలతతో విభజించడం అంటే 15÷3=5 అయిదు అయిదుగా ఏర్పడుతుంది. ఇప్పుడు అయిదు అయిదుగా ఉండే రేఖాచిత్రం వన్ సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	2	3
2	1	1	1	2
2	1	1	1	2
2	1	1	1	2
3	2	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $5^3 = 125$.
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ 4ని 2తో గుణించాలి. (2 అనగా పై వైపు 4 కార్నర్స్, కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$.
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అనగా పై వైపు, కింది వైపు, మధ్యవైపు) పై రేఖాచిత్రం గమనిస్తే కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలింది 12. దీనిని 3తో గుణిస్తే $12 \times 3 = 36$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును ఉన్న ఘనాలు అనగా చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలో ఉండే వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అనగా ఆరు ముఖాలు అని అర్థం)పై రేఖాచిత్రం గమనిస్తే చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 9 ఉన్నాయి. కాబట్టి $9 \times 6 = 54$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$125 - (54+36+8)$
$125 - 98 = 27$ సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి



ప్రస్తుతం మెగా ఫ్యామిలీతో కలసి రామ్‌చరణ్ పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడా సంబరాలను ఆస్వాదిస్తున్నారు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మహిళల సింగిల్స్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. వీరిద్దరూ పారిస్ వీధుల్లో అనుకోకుండా ఒకరికొకరు ఎదురు పడ్డారు. చిరునవ్వుతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రామ్‌చరణ్ పెంపుడు కుక్క 'పిల్ల రైమ్' తలనిమిరారు సింధు. వారిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇద్దరూ గేమ్ ఛేంజర్‌లే మీ కలయిక అద్భుతం అంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు.



వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్న కథానాయకుడు అల్లరి నరేశ్. ఆయన హీరోగా 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఓ నూతన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రుహాని శర్మ హీరోయిన్. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ఆరంభించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రామకృష్ణ అర్రం, కెమెరా: జిజు సన్నీ, సంగీతం: జిబ్రాన్.



కొత్త తరహా పాత్ర

తమిళ హీరో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఇదివరకు ఎన్నడూ చేయని పాత్రను ధనుష్ ఇందులో పోషిస్తున్నారు. ఆయన పెర్ఫార్మెన్స్ నెక్ట్స్ లెవల్‌లో ఉంటుందని మేకర్స్ చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సోషల్ డ్రామాలో రష్మిక కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహనరావు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ కొత్త అధ్యక్షుడిగా భరత్ భూషణ్

తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రస్తుత అధ్యక్షుడు దిల్ రాజు పదవీకాలం ముగియడంతో ఆదివారం ఎన్నికలు జరిపి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.. ఈసారి డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి పి.భరత్ భూషణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.అశోక్‌కుమార్ గెలిచారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. అందరం కలసి మంచి నిర్ణయాలతో ముందుకు వెళతాం. ఈ రోజు గెలిచిన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాటకు కట్టుబడి ఉండే వ్యక్తులు. గెలిచిన వారికి సభ్యులందరి మద్దతు ఉంటుంది' అన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఛాంబర్ అంతా ఒక కుటుంబం. పరిశ్రమలోని సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అందరం కలసి చర్చిస్తాం. భారతదేశంలోని అన్ని పరిశ్రమలను ఒక తాటి మీదకు తీసుకు వచ్చి ముందుకు వెళతాం' అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ భరత్ భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు.




'మిరపకాయ్' కంటే మెరుగ్గా

రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తయారవుతున్న 'మిస్టర్ బచ్చన్' రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో నిర్మాతలు ప్రమోషన్స్‌లో దూకుడు పెంచారు. ఇందులో భాగంగా ఆదివారం టీజర్ విడుదల చేశారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెర కెక్కిన ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ వ్యక్తిపై రైడ్ చేసే ఇన్‌కమ్ టాక్స్ అధికారిగా రవితేజ నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ '1980-90ల మధ్య జరిగే కథ ఇది. ల్యాండ్ ఫోన్లు, క్యాసెట్ రికార్డింగ్ సెంటర్లు, చేతక్ స్కూటర్లు, కుమార్ షాను పాటలు.. ఇవన్నీ 'మిస్టర్ బచ్చన్' ఫస్ట్ హాఫ్‌లో నోస్టాలజిక్ మూమెంట్స్‌గా ఉంటాయి. అలాగే అమితాబ్ గారిని బేస్ చేసుకుని కొన్ని ఐటెమ్స్ ఉంటాయి. నా కెరీర్‌లో చాలా ఫాస్ట్‌గా.. కేవలం 78 రోజుల్లో ఈ సినిమా తీశానంటే కారణం నిర్మాత విశ్వప్రసాద్‌గారు. ఇంతకుముందు మా కాంబినేషన్‌లో వచ్చిన 'మిరపకాయ్' కంటే మెరుగ్గా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఆగస్టు 15న సినిమాను విడుదల చేస్తున్నాం' అని విశ్వప్రసాద్ తెలిపారు.



సుకుమార్ సతీమణి సమర్పణలో..

రావు రమేశ్ హీరోగా నటించిన 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో వస్తున్న తొలి చిత్రం ఇది కావడం విశేషం. కంటెంట్ నచ్చడంతో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ఆగస్టు 23న విడుదల చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ ఆదివారం విడుదల చేశారు. 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం' చిత్రంలో ఎటకారం ఎక్కువున్న సుబ్రహ్మణ్యం భార్యగా ఇంద్రజ, అత్తగారిగా అన్నపూర్ణమ్మ నటించారు. 'మా నాన్న అల్లు అరవింద్' అంటూ గొప్పలు చెప్పి ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమలో పడేసే సుబ్రహ్మణ్యం కొడుకుగా అంకిత్ కొయ్య, అతని సరసన రమ్య పసుపులేటి నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.





ఆ లోటును భర్తీ చేసేలా...

'నువ్వేకావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి చిత్రాలతో పాపులర్ దర్శకుడిగా మారారు కె. విజయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఈ లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ప్రధాన తారాగణంగా నటించారు. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కె. విజయ్‌భాస్కర్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమా ప్రేమకు సరికొత్త నిర్వచనం ఇస్తుంది. ఈ మధ్య కాలంలో ప్రేమ కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఇది ఆ లోటును భర్తీ చేస్తుంది. ఇంటిల్లిపాదీ చూడదగిన చిత్రమిది. ఉషా అనే అమ్మాయి పెళ్లి చుట్టూ సినిమా కథాంశం సాగుతుంది. మా అబ్బాయి కమల్ కోసం ప్రత్యేకంగా కథ రాసుకుని ఈ సినిమా చేయట్లేదు. ఈ కథకు తను యాప్ట్ కాబట్టే కమల్‌ను హీరోగా ఎంచుకున్నాను. కమల్, కథానాయిక తాన్వీ నటన చాలా సహజంగా.. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ. ఆర్.ఆర్.ధ్రువన్ అద్భుతమైన పాటలు అందించారు. సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీని కూడా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

కాలరెత్తి తిరగరా...

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న విడుదలవుతోంది. ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం 'లక్కీ భాస్కర్' టైటిల్ ట్రాక్‌ను విడుదల చేసింది. 'శభాష్ సోదరా...కాలరెత్తి తిరగరా...కరెన్సీ దేవి నిను వరించెరా' అంటూ సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు.



ఆకాశంలో ఒక తార

పవన్ సాదినేని దర్శకత్వంలో దుల్కర్ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో రైతు లుక్‌లో దుల్కర్ కనిపించారు. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు.




రాజాం పురపాలక సంఘ కార్యాలయంలో పై పెచ్చులు ఊడిన దృశ్యం, కంప్యూటర్లపై కప్పిన టార్పాలిన్లు




బొబ్బిలి డిప్యూటీ డీఈవో కార్యాలయం కారిపోతున్న దృశ్యం, కార్యాలయంలో శ్లాబ్ దుస్థితి

కారుతున్న కార్యాలయాలు

జిల్లాలోని అనేక ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. వర్షం పడితే పైనుంచి నీరు కారి కార్యాలయం అంతా తడిసిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కంప్యూటర్లను సిబ్బంది టార్పాలిన్లతో కప్పి కాపాడుకుంటున్నారు. అంతేకాకుండా పై పెచ్చులు సైతం ఊడి పడుతుండడంతో సిబ్బంది సైతం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

- జిల్లాలో పలు ప్రభుత్వ ఆఫీసుల్లో ఇదే పరిస్థితి
- బిక్కుబిక్కు మంటూ విధుల నిర్వహణ
- కంప్యూటర్లు తడవకుండా టార్పారిన్లతో మూత

రాజాం: స్థానిక పురపాలక సంఘం కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పెచ్చులూడి సిబ్బందిపై పడే పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు వర్షానికి తడవకుండా టార్పన్లుతో కప్పవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది, సిబ్బంది విధులు ముగించుకొని కంప్యూటర్లను టార్పన్లుతో కప్పి వెళ్లిపోతున్నారు, మరుసటి రోజు విధులకు వచ్చిన తరువాత టార్పన్లును తొలగించవాల్సిన దుస్థితి నెలకొంటుంది. గత నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గల డిప్యూటీ డీఈవో కార్యాలయం అత్యంత దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. డివిజన్ స్థాయి కార్యాలయం అయినప్పటికీ దానికి సొంతభవనం అంటూ ఏదీ లేకుండా పోయింది. పరాయిపంచిన ఈ కార్యాలయం నడుస్తోంది. పై కప్పు పెచ్చులూడిపోయి శిథిలావస్థలో ఉన్న ఈ భవనంలో రికార్డులు దాచుకోవడానికి అధికారులు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ఏమాత్రం వర్షం కురిసినా కార్యాలయం అంతా తడిసి ముద్దయిపోతోంది.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

విజయనగరం రూరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మందికి ప్రయోజనం కలుగుతుందని, ఆ దిశగా ఆలోచన చేయాలని జన విజ్ఞానవేదిక ప్రతినిధులు ఎంవీ ఆర్ కృష్ణాజీ సూచించారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక ప్రతినిధులతో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు రాజ్‌గోపాల్, ఎరుకొండ ఆనంద్, ఎస్ శివాజీ, పి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో ప్రతి ఇంటికీ డోర్ నెంబర్

కొత్తవలస: కొత్తవలసలోని ప్రతి ఇంటికీ డోరునెంబర్‌ను కేటాయిస్తున్నట్టు ఈవోపీఆర్డీ ధర్మారావు తెలిపారు. కొత్తవలస పంచాయతీని 46 బ్లాకులుగా విడదీశారని, ఒక్కొక్క బ్లాక్‌లో 140 ఇళ్లవరకు కేటాయించి వాటికి బ్లాక్ నెంబర్, డోరు నెంబర్ ఇస్తారన్నారు. ప్రతి ఇంటికీ సంబంధించి ఆ బ్లాక్ నెంబర్, డోరునెంబరుతో ప్లేట్‌లను అతికిస్తారన్నారు. నంబర్ ప్లేట్‌లు రావడానికి కొంత సమయం పడుతుందన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తవలస: కొత్తవలస పంచాయతీ గవరపాలెం గ్రామంలో నిర్మాణం చేస్తున్న సీతారామ ఆలయ నిర్మాణానికి పూర్వ విద్యార్థులు విరాళాలు అందించారు. గ్రామానికి చెందిన సీతారామ గౌరీ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో సీతారామాలయాన్ని నిర్మాణం చేస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని గ్రామానికి చెందిన 1990-92 సంవత్సరాల్లో కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థి కె.గణపతి తోటి విద్యార్థులను కోరడంతో అందుకు పూర్వ విద్యార్థులు 2 లక్షల 72 వేల 127 రూపాయలను సేకరించి ఆదివారం గణపతికి అందచేశారు.

ఈ నెల 30న పీడీఎస్ బియ్యం వేలం

తెర్లాం, జూలై 28: మండలంలోని వివిధ 6ఏ కేసుల్లో పట్టుబడిన బియ్యాన్ని ఈ నెల 30 న వేలం వేయనున్నట్టు సీఎస్‌డీటీ స్వర్ణలత తెలిపారు. స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఈ నెల 30వ తేదీన 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలం వేయనున్నటు ఆమె తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొనవచ్చునని కోరారు.

రోటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం

విజయనగరం దాసన్నపేట, జూలై 28: నగరంలోని ధర్మపురిలో ఐదో రోటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ధర్మపురి క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కంది శంకర్, అశోక్, ఆర్‌కే కళాశాల క్లబ్ అధ్యక్షులుగా అయ్యమన్, కార్యదర్శిగా ప్రసాద్, ఏక్తా క్లబ్ నూతన అధ్యక్షురాలిగా ఐశ్వర్య, కార్యదర్శిగా అస్మితలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, టీఎల్ఎన్ మూర్తి, సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం జోన్ రోటరాక్ట్ ప్రతినిధి సాయిబాలి పర్యవేక్షించారు.

ఓడీఎఫ్ సర్వే పరిశీలన

రాజాం: మండలం రాజయ్యపేట, కంచరాం, గారాజు చీపురుపల్లి గ్రామాల్లో ఆదివారం జరుగుతున్న ఓడీఎఫ్ సర్వేను ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారా లేదా వాటిని వినియోగిస్తున్నారా లేదా, దానికి సంబంధించిన సెప్టింక్ ట్యాంక్ వివరాలు, ప్రతి రోజూ చెత్తను పారిశుధ్య కార్మికులు అందజేస్తున్నారా లేదా అనే విషయాలని తెలుసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా చేయిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ సర్వే విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు.

బొబ్బిలి రూరల్: ప్రతి గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత(ఓ.డి.ఎఫ్) గ్రామంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఆదివారం ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి పరిశుభ్రమైన వాతావరణంతో కూడిన గ్రామీణాభివృద్ధికి తోడ్పడాలన్నారు. బహిరంగ మలవిసర్జన వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అనంతరం గామంలో నిర్మాణంలో ఉన్న బీటీ రోడ్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంటు ఉన్నారు.

విద్యార్థులకు స్పెల్లింగ్ పోటీలు

తెర్లాం, జూలై 28: తొలిసారిగా గ్రామీణ ప్రాంతంలో నిర్వహించిన స్పెల్లింగ్ బీ పోటీల్లో మండలంలోని నందబలగ జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 96 మంది పాల్గొన్నారని ఆంగ్ల ఉపాధ్యాయుడు విజయమోహన్ అన్నారు. మొత్తం 6 రౌండ్స్‌లో 400 ఇంగ్లీషు పదాలు డిక్టేషన్, స్పెల్లింగ్‌లపై పోటీలు నిర్వహించారు. ఆరు గ్రూపులుగా విద్యార్థులు పోటీలో పాల్గొనగా ఫైనల్ రౌండ్‌లో వి.సా త్విక్ గ్రూపు 18 పాయింట్లు సాధించి విజయం సాధించి నట్టు తెలిపారు. అనంతరం విజేతలకు ప్రసంశాపత్రాలను అందజేశారు.



మాట్లాడుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు

బాలల అక్రమ రవాణాని అరికడదాం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం దాసన్నపేట, జూలై 28: రాష్ట్రంలో బాలలు, మానవ అక్రమ రవాణాని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జడ్పీ అతిథి గృహంలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్ప్ విముక్తి సంస్థ రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా నిరోధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని శాఖల విభాగాలు, సిబ్బంది భాగస్వామ్యం కావాలన్నారు. కేసలి అప్పారావు మాట్లాడుతూ, కొంత మంది మధ్యవర్తులు, మోసగాళ్లు, ఉద్యోగాలు, సినిమా, టీవీల్లో నటించే అవకాశం కల్పిస్తామని ప్రలోభాలకు గురిచేసి బాలలను, యువతను మోసం చేస్తున్నారన్నారు. మానవ అక్రమ రవాణాని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. సీడబ్ల్యూసీ ఛైర్మన్ హిమబిందు, రామకోటి, మీనా, గౌరీ, అనిల్, మమ్ముల తిరుపతిరావు, ఎంజీఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజానికి మేలు చేసేవారే

- మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్



మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

కొత్తవలస, జూలై 28: ఆర్యవైశ్యులు సమాజానికి మేలు చేసేవారేగానీ ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని మాజీ రాజ్యసభ సభ్యుడు టీ.జీ.వెంకటేష్ అన్నారు. ఆదివారం కొత్తవలసలోని జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్య సంఘం సమాజంలో ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలబడుతుందన్నారు. ప్రస్తుతం చట్టసభల్లో ఆర్యవైశ్యుల ప్రాతినిధ్యం అరకొరగా ఉందన్నారు. ప్రస్తుత తెలుగుదేశ ప్రభుత్వం ఆర్య వైశ్య సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించిందన్నారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ దూండీ రాకేష్ మాట్లాడుతూ ఆర్య వైశ్యులు చాలా సౌమ్యులని, వివాదాల జోలికి వెళ్లరని అన్నారు. ఆర్యవైశ్య మహాసభ రాజకీయ సలహాదారుడు అంబికా కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎన్నికైన చెరుకూరి నాగరాజు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మూడువేలకు చేరిన జనసేన సభ్యత్వాలు



సభ్యత్వ రశీదు అందజేస్తున్న సురేష్ బాబు

రాజాం రూరల్, జులై 28: రాజాం ని యోజకవర్గంలో జనసేన క్రియాశీలక సభ్యత్వాల సంఖ్య మూడువేలకు చే రిందని ఆ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పొగిరి సురేష్ బాబు తెలిపారు. పార్టీ అధినేత, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు రాజాం నియోజకవ ర్గంలోని నాలుగు మండలాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతోందని వివ రించారు. ఆదివారం రాజాం మండలం బొడ్డవలస గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి ఈ నెల 28తో సభ్య త్వ నమోదు ప్రక్రియ ముగిసినప్పటికీ మరో వారంరోజుల పా టు ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని అధిష్ఠానం నిర్ణయించిందని, ఫలితంగా మరో వారం రోజుల పాటు సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగిస్తామన్నారు.


గో హంతకులపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలి



అక్రమ కబేళా వద్ద నిరసన తెలియజేస్తున్న సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, జూలై 28: జిల్లాలో వందలాది గోవులను నరికి, చంపుతున్నా, కసాయి వారిపై రౌడీషీట్లు ప్రారంభించాలని గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేట స్వర్గధామం సమీపంలో వున్న అక్రమ కబేళా ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా అక్రమంగా ఆవులను వధిస్తూ, మాంసాన్ని ఎగుమతి చేస్తున్నారని కేసులు నమోదు చేసినా, ఆవులను నరికివేత ఆగడం లేదన్నారు. తక్షణమే కబేళాను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మద్దిల సోంబాబు, రవిశంకర్, గోలగాని రమేష్, సాయికుమార్, రమేష్, నారాయణరావు, విశ్వనాథ్, నీలావు దేవి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌వాలీబాల్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు

విజయనగరం టౌన్: వచ్చేనెల 2నుంచి నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో జరగనున్న 11వ రాష్ట్రస్థాయి స్త్రీ ,పురుషులు సీనియర్ బీచ్ కబడ్డీ పోటీలకు విజయనగరం జిల్లా జట్లు ఎంపిక ఆదివారం జరిగింది. నెల్లిమర్ల మండలం సారిపల్లిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను ఎంపికచేశామని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు దొర, కె.వి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్షణరావు తెలిపారు. ఎంపికైన జట్లు వచ్చేనెల 1న బయలుదేరి వెలతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రరటరీ నడిపేన సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శివ, గోపాల్, తిరుపతి రావు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కాపీలు దహనం చేసి నిరసన



రంగరాయపురంలో బడ్జెట్ కాపీలు దహనం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, జూలై 28: మండలంలోని రంగరాయపురం గ్రామంలో ఆదివారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాల్ ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతులు మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కాపీలను దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధర కల్పించి పంట కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఐటీఐ రెండో విడత కౌన్సిలింగ్



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమణారావు

బొబ్బిలి, జూలై 28: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన రెండోవిడత కౌన్సిలింగ్‌లో 142 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణరావు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్‌మెకానిక్, టర్నర్, మెషినిస్టు, మోటారు మెకానిక్ ట్రేడుల్లో సీట్ల కోసం మొత్తం 197 మంది విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారన్నారు. కౌన్సిలింగ్‌లో అర్హత సాధించిన వారికి ఎంపిక పత్రాలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు. ఐటీఐ సిబ్బంది దేముడు, క్రాంతికుమార్, దుక్క శేఖర్, రాములప్పడు, ప్రసాద్, శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కష్టాన్ని పద్యాల్లో రాసేవాడే కవి



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం, జూలై 28: ప్రపంచంలో ఏదో మూల ఎక్కడో ఒక చోట యుద్ధాలు, దోపిడీలు, తిరుగుబాట్లు జరుగుతునే ఉంటాయని, అలాంటి సమయాల్లో జరిగిన మార్పుల్ని, కలిగిన ఆవేదనని కవిత్వీకరించి రాసేవాడే కవి అని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత బాల సుధాకర మౌళి అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం రచించిన 'కాలం కత్తి మొన మీద' అనే కవితా సంపుటిని బాల సుధాకర్ మౌళి ఆవిష్కరించారు. అనంతరం ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. కవికి సమాజ దృష్టి ఉండాలని, సమాజంలోని హెచ్చుతగ్గులను చిత్రించగలగాలని, ఆవేదనను, కన్నీళ్లను కవి తాత్మకంగా రాసి ప్రజల హృదయాలను కదిలించాలని ఆయన అన్నారు. అనంతరం కంచరామ భుజంగ రావు కవితా సంపుటిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రచయిత రంగనాథాన్ని వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సిరికి స్వామినాయుడు, లండ సాంబమూర్తి, కలమట దాసుబాబు, గార రవిప్రసాద్, పొన్నాడ వరాహ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విజయనగరం రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంఆర్ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పి ఉదయ్‌శంకర్ అన్నారు. ఆదివారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కార్యాలయ ఆవరణలోనూ, ఇంటి ఆవరణలోనూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఏదో ఒకచోట ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని వికాస తరంగిణి మహిళా యోగ ఆరోగ్య వికాస్ కో ఆర్డినేటర్ అమనాన లలిత పిలుపునిచ్చారు. మొక్కల్ని నాటుతున్నారే తప్ప దానిని పెంచే బాధ్యతను విస్మరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. వికాసతరంగిణి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మొక్కల్ని నాటారు. వాటిని సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. వికాస తరంగిణి సెంట్రల్ కమిటి కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అడవుల విస్తీర్ణం తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దాసరి రాధ, పద్మశ్రీ, లేపాక్షి, వికాస తరంగిణి రాజాం శాఖ అధ్యక్షులు వాకచర్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజాంలో మొక్క నాటుతున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని మండలంలోని పిరిడి గ్రామం మువ్వలవీధిలో గల ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి లక్షణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పక్కి ప్రత్యేక ప్రైమరీ స్కూల్లో ఆదివారం ఎంఈవో చల్లా లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకురాలు కె.విజయగౌరి తదితరులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి, శర్మ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



లక్ష్మి(ఫైల్)

భోగాపురం, జూలై 28: రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ ఎ.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలం కృష్ణాపురానికి చెందిన తిరుమల లక్ష్మి(51) తన భర్తతో కలిసి కొనయ్యపాలెం కొబ్బరితోటలో నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు విశాఖ జిల్లా పరవాడ సమీపంలో పరిశ్రమలో పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. తిరుమల లక్ష్మి రెండు రోజుల క్రితం పరవాడలో ఉన్న తనకుమారుడి ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి కుమారుడు తిరుమలప్రసాదరాజుతో కలిసి స్వగ్రామానికి ఆదివారం ద్విచక్రవాహనంపై లక్ష్మి తిరుగు ప్రయాణమైంది. ఇలా వస్తుండగా విశాఖ నుంచి శ్రీకాకుళం రహదారిలో మండలంలోని అవనాం జంక్షన్ ఎత్తుబ్రిడ్జిపైకి వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొంది. దీంతో రెండు ద్విచక్రవాహనాలపై ఉన్న ముగ్గురు నేలకొరిగి తీవ్రగాయాల పాలయ్యారు. వీరిని 108లో చికిత్స నిమిత్తం తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా తిరుమల లక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాలు పాలైన తిరుమల ప్రసాదురాజు, మరో ద్విచక్రవాహనదారుడు చీపురుపల్లికి చెందిన వెంకటేశ్వరరావు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త తిరుమల రమణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో చీపురుపల్లి యువకుడి దుర్మరణం



మహేష్ (ఫైల్)

చీపురుపల్లి, జూలై 28: చీపురుపల్లి పట్టణానికి చెందిన యువకుడు హైద్రాబాద్‌లో మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చీపురుపల్లి బజారువీధికి చెందిన కిల్లంశెట్టి గోవింద్, నాగరత్నంలకు ముగ్గురు కుమారులు. వీరిలో రెండో కుమారుడైన కిల్లంశెట్టి మహేష్(29) హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేటు ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 25న విధి నిర్వహణలో ఉండగా మహేష్‌ను కారు ఢీకొంది. అయితే, బయటికి కనిపించే గాయాలేవీ లేకపోవడంతో ఆయన తన రూమ్‌కి వెళ్లిపోయారు. కొంత సమయానికి స్పృహ తప్పి పడిపోవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆయన మరణించారు. రోడ్డు ప్రమాదంలో ఆయన తలకు బలమైన గాయమై ఉంటుందని తలిదండ్రులు అనుమానిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

రామభద్రపురం: మండల పరిధిలో మిర్తివలస గ్రామ శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ ఘటనపై ఎస్సై జ్ఞనప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్తివలస గ్రామానికి చెందిన గులువిందుల సాయి బైక్‌పై సాలూరు జంక్షన్‌వైపు వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న తారాపురానికి చెందిన పొట్టంగి రామ్మూర్తి నాయుడు, సింగారపు లక్ష్మీశ్రీపతినాయుడు ఢీకొన్నారు. ఘటనలో సాయి, రామ్మూర్తికి తీవ్రంగా, లక్ష్మీశ్రీపతికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. దనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియం, డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఇంటర్ జోనల్ పురుషుల (సీనియర్) విభాగంలో క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరగుతున్నాయి. ఆదివారం విజ్జీ స్టేడియంలో జరిగిన అనంతపూర్ -రెస్టాఫ్ సెంట్రల్ జోన్ మ్యాచ్‌లో అనంతపూర్ జిల్లా జట్టు 4వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన సెంట్రల్ జోన్ జట్టు నిర్ణీత 50ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగులు సాధించింది. అనంతరం 244 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపూర్ జట్టు 6 వికెట్లు నష్టపోయి 247 సాధించి విజయదంఖా మోగించింది. డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ మైదానంలో గుంటూరు తూర్పుగోదావరి జట్లమధ్య జరిగిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన గుంటూరు జట్టు నిర్ణీత 50ఓవర్లలలో 8 వికెట్లనష్టానికి 228 పరుగుల స్వల్ప స్కోరుకే పరిమితిమైంది. అనంతరం 229 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన తూర్పుగోదావరి జట్టు 3 వికెట్లు నష్టపోయి విజయాన్ని అందుకుంది.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

రాజాం, జూలై 28: సమాచార హక్కు చట్ట న్యాయపోరాట సమన్వయ కమిటీ, సమాచార హక్కు చట్ట ప్రజారక్షణ కమిటీ ఆధ్వర్యంలో రాజాంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు గంటాన అప్పారావు, ఆంధ్ర తెలంగాణ కన్వీనర్ సీహెచ్ శ్రీనివాస్, కె మోహన్‌రాజు, ఎం రవి కిరణ్, కె రామారావు, ఎల్ శ్రీనివాసరావు, బి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ కార్యదర్శి గంటాన అప్పారావు మాట్లాడుతూ అక్టోబరు 2005 నుంచి భారతదేశంలో ఈ చట్టం అమలు జరుగుతుందని, అయినప్పటికీ చాలామంది ప్రజలకు ఈ చట్టం మీద అవగాహన లేదన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలో కొమిర గ్రామంలో ఆదివారం విద్యార్థులకు స్థానిక యూత్ నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అబ్దుల్‌కలాం వర్ధంతి నేపథ్యంలో ఆయన స్మారకార్థం విద్యార్థులకు వితరణగా అందించినట్లు స్థానిక మాజీ సర్పంచ్ బొత్స రమేష్ నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ సంస్థ ఉద్యోగుల సంఘం యూనియన్ నాయకులు పి.ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి జి.కేశవరావు, ఉపాధ్యాయులు కెంబూరు శ్రీనివాసరావు, పాడి పాపినాయుడు, బొత్స శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రెడ్డికి ప్రముఖుల ఘన నివాళి



డాక్టర్ రెడ్డికి నివాళులు అర్పిస్తున్న బేబీనాయన

బొబ్బిలి, జూలై 28: బొబ్బిలి పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ రెడ్డి సత్యారావుకు ఆదివారం పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే బేబీనాయనతో పాటు టీడీపీ నాయకులు రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

వరుస చోరీలు..

- భయాందోళనలో పురిటిపెంట, గజపతినగరం పట్టణవాసులు
- పోలీసులకు సవాల్

గజపతినగరం: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పురిటిపెంట గ్రామంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో ఆ గ్రామస్థులతో పాటు సమీపంలో ఉన్న పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు. రోజులు, నెలల వ్యవధిలో చోరీలు జరగడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ముఖ్యంగా తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్నారు.

● గత ఏప్రిల్ నెలలో న్యూకోలనీలో అనురాధ అనే ఓ ఉద్యోగిని ఇంట్లో సుమారు రూ.10 లక్షల నగదు, 15తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. తమ బంధువుల పెళ్లికి ఉంచిన నగదు, బంగారు ఆభరణాలు ఇంట్లో ఉంచి విజయనగరంలో పెళ్లి పనుల నిమిత్తం వెళ్లగా అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి దొంగలు నగదు, ఆభరణాలు అపహరించుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎటువంటి రికవరీ లేదు.

● అలాగే జూన్ నెలలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మణికంఠ వ్యాపారి కాశీకి వెళ్తూ తమ బంధువులకు ఇంటికి తాళం అప్పగించారు. బంధువు ఇంటికి తాళం వేసి, వ్యాపార నిమిత్తం బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. సుమారు లక్ష రూపాయల నగదు, 8 తులాల బంగారం అపహరించుకు పోయారు. పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకుని నగదు, బంగారం రికవరీ చేశారు.

● బాలాజీనగర్‌లో ముద్రగడ గౌరీ అనే వ్యక్తి తన ఇంటి కింద షాపులో రేడియో మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 24న రాత్రి వర్షంలో తడిచి వచ్చి తన చేతికి ఉన్న రెండు ఉంగరాలు, రూ.15వేల నగదు షాపులో ఉంచి ఇంటికి వెళ్లాడు. తర్వాత రోజు షాపు తెరవడానికి రాగా, తలుపులు తీసి ఉన్నాయి. ఉంగరాలు, రూ.15వేలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో శాఖా గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తున్న స్వప్న భర్త రాము ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగిన విషయం తెలిసిందే.

ఇలా వరుస చోరీలు జరుగుతుండడంతో పట్టణవాసులు గగ్గోలు పెడుతున్నారు. పోలీసుల దృష్టికి రాని చోరీలు కూడా ఉన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లు అద్దెకు కావాలంటూ వీధుల్లో తిరుగుతూ ఇంటికి తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు అరికట్టే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో ఉన్న భయాందోళన తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


పురిటిపెంటలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)


గుర్ల: ట్రాన్స్‌ఫార్మర్‌లో భాగాలను దొంగిలించిన దృశ్యం

గస్తీని పెంచాం..

రాత్రి పూట నిర్వహించే పోలీసు గస్తీని పెంచాం. పట్టణాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరిగితే తక్షణమే పోలీసులకు సమాచారం అందజేయాలి. ఇటీవల ఇతర ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జైలు నుంచి విడుదల అయ్యారు. వారిపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం.

-ఎన్‌వీ ప్రభాకరరావు, సీఐ, గజపతినగరం

పెరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు..

గుర్ల: మండలంలో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు ఎక్కువయ్యాయి. మూడు రోజుల కిందట పోలీసు స్టేషన్‌కు కూతవేట దూరంలో ఉన్న గోసాడ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించారు. అందులో ఉన్న వైర్లు, సల్ఫర్ వంటి విలువైన వస్తువులు దొంగలించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గొల్లపూడి సత్యనారాయణ మూర్తికి చెందిన వాటర్ ప్లాంట్ వద్ద ఈ దొంగతనం జరిగింది. ఈ మధ్యకాలంలో 12 ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన విద్యుత్‌వైర్లను దొంగిలించుకు పోయినట్లు తెలిసింది. పాలవలస నక్కలపేట, గరికవలస, కోటగండ్రేడు, గుజ్జింగివలస, గుర్ల తదితర గ్రామాల్లో ఈ మధ్య కాలంలో విద్యుత్‌వైర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురయ్యాయి. ఈ విషయమై సంబంధిత పోలీసులు శ్రద్ధ తీసుకొని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రికి పీహెచ్‌సీ వైద్యుల వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వైద్యుల సంఘం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో ఐదేళ్లగా సేవలందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలని కోరుతూ జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు ఆదివారం సాలూరులోని తన స్వగృహంలో ఆమెను కలిసి, వినతిపత్రం అందజేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ఇన్ సర్వీస్ కోటా 50 శాతం పీహెచ్‌సీ వైద్యులకు అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కళలను ప్రోత్సహించాలి


ఐక్యత చాటుతున్న కళాకారుల సంఘ సభ్యులు

గరుగుబిల్లి: కళలను ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంఘం సంక్షేమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు కోరారు. ఆదివారం తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కళాకారుల సంఘ అధ్యక్షుడు ద్వారపురెడ్డి ధనుంజయరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వాసుదేవరావు మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కలిగినటువంటి చింతామణి నాటకాన్ని ఆపి వేయడం అమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సలహాదారు ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.మంగాదేవి, మిమిక్రీ శివ, రాష్ట్ర కార్యదర్శి మువ్వల వెంకటరమణ, కోశాధికారి కర్నూలు మహాలింగప్ప, అనంతపురం కుళ్లయ్యప్ప, ప్రకాశం వరప్రసాద్, కాకినాడ రాజబాబుతో పాటు వివిధ జిల్లాల పౌరాణిక రంగాలలో ప్రావీణ్యం ఉన్న కళాకారులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి

పాలకొండ: పట్టణంలోని ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కోట తిరుపతిరావు తెలిపారు. పట్టణంలోని శేఖర్ కళ్యాణ మండపంలో బీజేపీ పాలకొండ అర్బన్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుపతిరావు పాల్గొన్నారు. ఎన్‌డీఏ కూటమి పథకాలు, ప్రధానమంత్రి విశిష్టత ప్రజలకు తెలియజేయాలని తీర్మానించారు. అనంతరం 50 మంది యువకులు బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టంకాల దుర్గారావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఊణ్ణ పెదబాబు, సీనియర్ నాయకులు కుప్పన్నగారి కుమార్‌రాజా, విశ్రాంత ఎంపీడీవో గార రమణమ్మ, ఉంజేటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు

గరుగుబిల్లి: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దృష్టికి ప్రధాన సమస్యలు తీసుకువెళ్లానని టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి, నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం అమరావతిలో ఆయన్ని కలిసినట్టు స్థానిక విలేకర్లకు ఫోన్‌లో చెప్పారు. జిల్లాలోని రహదారులు, తోటపల్లి ఆధునీకరణ పనులు, జంఝావతి ప్రాజెక్టు, ఉల్లిభద్ర ఎత్తిపోతల పథకం తదితర వాటిపై వివరించానని తెలిపారు. వరుస క్రమంలో నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు.

విజయవాడ దుర్గమ్మకు సారె సమర్పణ


అమ్మవారికి సారె సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

పూసపాటిరేగ: ప్రతిఏటా ఆషాఢ మాసంలో విజయవాడ దుర్గమ్మకు సారె సమర్పించడం సంప్రదాయం. ఈ మేరకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన భక్తులు, గురుభవానీలు ఆదివారం అమ్మవారికి పెద్దఎత్తున సారె సమర్పించారు. సుమారు 500మంది భక్తులు ఇక్కడి నుంచి వెళ్లి సారె సమర్పించినట్టు తెలిపారు. అఖిలాంధ్ర పీఠం తరపున ముప్పిడి నారాయణరావు, బొజ్జ విజయ్‌కుమార్, సంకాబత్తుల లక్ష్మణరావు, బర్రి చిన్నరావు, తదితరులు ఆధ్వర్యంలో సారె సమర్పించారు.

పూర్వ విద్యార్థుల కలయిక


పూర్వ విద్యార్థులతో రిటైర్డ్ ఉపాధ్యాయులు

కొమరాడ: కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులంతా ఆదివారం అదే పాఠశాల వద్ద కలుసుకున్నారు. తమ ఉపాధ్యాయులను సన్మానించారు. గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. రిటైర్డ్ టీచర్లు రామచంద్రరెడ్డి, గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠగిరిని దర్శించుకున్న సురేష్‌బాబు

గంట్యాడ: మండలంలోని తాటిపూడి రిజర్వాయర్ ఆవల గల ఎగువకొండపర్తి గిరిజన గ్రామంలో నూతనంగా నిర్మించిన వైకుంఠగిరి అనంత వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సురేష్ ప్రొడక్షన్స్ అధినేత దగ్గుపాటి సురేష్‌బాబు ఆదివారం సందర్శించారు. ఆలయంలోని స్వామివారిని దర్శించుకుని, వేద పండితుల ఆశీర్వాదం పొందారు.


స్వామివారిని దర్శించుకుంటున్న సురేష్‌బాబు

సాగులో డ్రమ్‌సీడర్ పద్ధతి మేలు

నెల్లిమర్ల: వరి సాగులో డ్రమ్‌సీడర్ పద్ధతి చాలా ప్రయోజనకరమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. సతివాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వరిసాగులో ఎద పద్ధతి, డ్రమ్‌సీడర్ వినియోగం తదితర విషయాలపై రైతులకు వివరించారు. ఈ పద్ధతుల ద్వారా రైతులకు నీటి ఆదాతో పాటు ఎకరాకు రూ.6వేల వరకు పెట్టుబడి కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సతివాడ ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ, అల్తిపాలెం సర్పంచ్ పప్పల భాస్కరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ఎద పద్ధతిపై రైతులకు వివరిస్తున్న దృశ్యం

గిరిజన ఉత్పత్తులకు చేయూత

● దళారీలను నిరోధిస్తున్న రైతు ఉత్పత్తిదారు సంఘాలు

కురుపాం రూరల్: రైతు ఉత్పత్తిదారు సంఘాల ద్వారా గిరిజనులు పండించిన పలు ఉత్పత్తులకు మంచి మార్కెట్ ధర లభిస్తోంది. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కురుపాం మండలంలో ఏర్పాటుచేసిన రైతు ఉత్పత్తిదారు సంఘంలో 350 మంది గిరిజనులు సభ్యులుగా ఉన్నారు. వారు పండించే అటవీ ఉత్పత్తులైన కొండచీపురు గడ్డి, జీడిపిక్కలు, చింతపండు, పత్తి పంటలకు మార్కెట్లో లభించే ధరకన్నా అధిక మొత్తం చెల్లిస్తున్నారు. చీపుర్లు తయారు చేసే ముడి సరుకు అయిన చీపురుగడ్డిని గిరిజన సహకార సంస్థ, దళారీలు కిలో ఒక్కంటికి 40 రూపాయలకు కొనుగోలు చేస్తుండగా.. రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా కిలో రూ.70కు కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని తోలుంగూడ గ్రామం నుంచి ఆదివారం చీపురుగడ్డిని కొనుగోలు చేసి, రవాణా చేశారు. ఈ ముడి సరుకును విశాఖపట్నం, హైదరాబాద్, గుంటూరు ప్రాంతాలకు కిలో ఒక్కంటికి రూ.85 అమ్మడం ద్వారా ఖర్చులు పోనూ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి ప్రోత్సాహకర ఆదాయం లభిస్తోంది. రాబోయే రోజుల్లో సీతాఫలం, పైనాపిల్ ఉత్పత్తులను కూడా కొనుగోలు చేసే ప్రతిపాదన ఉందంటూ రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధి సౌమ్య తెలిపారు. దీంతో తమకు మంచి మద్దతు ధర లభిస్తోందంటూ గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


తోలుంగూడ నుంచి చీపురుగడ్డిని తరలిస్తున్న దృశ్యం

మావోయిస్టు వారోత్సవాలు ప్రారంభం

● ఏవోబీలో పటిష్ఠ భద్రతా చర్యలు ● ముమ్మరంగా వాహన తనిఖీలు


సాలూరు రూరల్: మామిడిపల్లిలో పోలీసుల పహారా


భామిని: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సాలూరు రూరల్: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు ఆదివారం నుంచి ఆరంభమయ్యాయి. ఈసందర్భంగా ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు ప్రత్యేక కార్యాచరణతో పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. జిల్లాలో ఏజెన్సీ పోలీస్‌స్టేషన్లుకు, ప్రముఖుల భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఏజెన్సీకి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే ముందస్తు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ● మావోయిస్టు వారోత్సవాలు సందర్భంగా పటిష్ఠ భద్రత చర్యలు తీసుకున్నామని సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ప్రత్యేక దళాలతో ఏవోబీ అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

● **భామిని:** మావోయిస్టు వారోత్సవాలు సందర్భంగా ఎస్ఐ సీహెచ్.ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే ప్రత్యేక బలగాలు కూంబింగ్ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ప్రభావం లేకపోయినా పోలీసులు ప్రత్యేక నిఘా చేపడుతున్నారు. ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి చర్యలు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆదివాసీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం సీతంపేటలోని తన చాంబర్‌లో పలువురు నాయకులు ఆయన్ని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక నాయకులు బి.తేజేశ్వరరావు, ఆరిక మన్మథరావు, అప్పన్న, మూటక రవి, కె.సుబ్బారావు, ఎస్.కాంతారావు, బి.సూర్యారావు, రాజారావు, సూరిబాబు, సుగ్రీవులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై ప్రచారం

భోగాపురం: భోగాపురంలో జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదుపై ఆ పార్టీ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సభ్యత్వం పొందిన వ్యక్తి ఎప్పుడైనా మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షలు సాయం అందుతుందని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు వందనాల రమణ, నాయకులు బొల్లు త్రినాథ్, బొడ్డ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వంపై ప్రచారం చేస్తున్న దృశ్యం

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న వాటిలో ఒక ఆటో, 4 బైకులు ఉన్నా యని చెప్పారు. నిబంధనల మేరకు వేలం నిర్వహించామని చెప్పారు. అనంతరం గతంలో స్వాధీనం చేసుకున్న 467 లీటర్ల సారాతో పాటు 8 మద్యం కేసులకు చెందిన సీసాలను ధ్వంసం చేశారు. 13 మద్యం కేసులకు చెందిన సామగ్రి ని పారబోయించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. పరిమితికి మించి వాహనాలపై తరలిస్తే రవాణా చట్టం ప్రకారం జరిమానా తప్పదని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో నేరాల సంఖ్యను అదుపులో పెట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతు న్నా మని చెప్పారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక గస్తీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరించి నట్లయితే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.అమ్మన్నరావు తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ ఆవరణలో మద్యం కేసులను పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

మొరాయించిన ఆర్టీసీ బస్సు

సీతంపేట: పాలకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఆదివారం సిరికొండ వద్ద మొరాయించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాలకొండ నుంచి సీతంపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉదయం 9 గంటల సమయంలో బేరింగులు పట్టేయడంతో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొంత సమయం తర్వాత అటుగా వెళ్తున్న వేరే ఆర్టీసీ బస్సులో ప్రయాణికులను పంపించేశారు.


సిరికొండ వద్ద ఆగిపోయిన బస్సు

కులంపేరుతో దూషించినవారిని అరెస్టు చేయాలి

పాలకొండ: గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో ఈనెల 15న కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎస్టీలను కులం పేరుతో తిట్టి, కొట్టిన పెత్తందారులను అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈనెల 29న కలెక్టరేట్ వద్ద నిరసన కార్య క్రమానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీసులకు ముందస్తు నోటీసు అందించారు. గరుగుబిల్లి, శివ్వాం దళితుల న్యాయమైన భూ సమస్య పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు

గరుగుబిల్లి: పెద్దూరు గ్రామంలో వీధులు వర్షాలకు బురదమయం అవుతున్నాయి. దీంతో సర్పంచ్ ఎం.నారాయణమ్మ, ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు దృష్టి సారించి వీధుల్లో గ్రావెల్ వేయించి, చదును చేయిస్తున్నారు. గ్రామం లోతట్టుగా ఉండటంతో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ పరిధిలో నిధుల సమస్య ఉంది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు ముందుగా అవసరమైన చర్యలు చేపట్టారు.


పెద్దూరు వీధుల్లో గ్రావెల్‌తో చదును చేయిస్తున్న దృశ్యం

పల్లెల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

పార్వతీపురం రూరల్: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. కాలువల్లోని మురుగును తొలగింపజేస్తున్నారు.

క్లుప్తంగా..

2న సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల సర్వసభ్య సమావేశం ఆగస్టు 2న నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో జి.రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరవుతున్నట్టు ఆయన చెప్పారు. మండలంలో ఉన్న 27 గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

పోలీస్‌స్టేషన్ భవనానికి ప్రతిపాదన

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని హోం మంత్రిని కోరినట్టు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం తెలిపారు. ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ సర్కిల్ కార్యాలయం నిర్మించి 40 ఏళ్లు పైగా అయిందని, ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థలకు చేరుకుందని చెప్పారు. దీని స్థానంలో కొత్త భవనానికి నిధులు మంజూరు చేయాలని తాను హోంమంత్రికి కోరినట్టు తెలిపారు.

వెంకన్నను దర్శించుకున్న విజయచంద్ర



పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం దర్శించుకున్నారు. నియోజకవర్గం తోపాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకున్నట్టు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో టీటీడీ కల్యాణ మండపాల ఏర్పాటుకు, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతానని ఆయన ఫోన్‌లో స్థానిక విలేకర్లతో తెలిపారు.

దన్నానపేటను సందర్శించిన జడ్పీ చైర్మన్

నెల్లిమర్ల: దన్నానపేటలో రెవెన్యూ అధికారులు కూల్చివేసిన ఇంటి ప్రహరీని జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ప్రహరీ యజమాని పతివాడ పైడిచిట్టిని పరామర్శించి, ఓదార్చారు. మళ్లీ ఇలాంటి చర్యలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

అధ్వానంగా గ్రామాలు

సాలూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దిగువ మెండంగి, గంగన్నదొరవలస తదితర గ్రామాల్లో చెత్త పేరుకుపోయింది. పక్షోత్సవాల్లో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.


గంగన్నదొరవలసలో పేరుకుపోయిన చెత్త